తారు ఎప్పుడు వేస్తారు సారూ?

- వన్నెల్(బి) నుంచి వేంపల్లి రోడ్డు వరకు లింకు రోడ్డు
- కంకర వేసి వదిలేసిన వైనం
- రెండునెలలు గడుస్తున్నా తారువేయలేదు
- నడక నరకప్రాయమైందంటున్న ప్రయాణికులు
- పనులను పూర్తి చేయాలని వేడుకోలు


కంకర వేసి వదిలేసిన రోడ్డు

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) శివారు నుంచి ముప్కాల్ మండలం వేంపల్లి శివారు వరకు వేంపల్లి, రెంజర్ల రోడ్డును కలుపుతూ చేపట్టిన లింకు రోడ్డుపై తారు ఎప్పుడు వేస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. లింకు రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేయగా, ఈ ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో అప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభం కావడంతో, ప్రయాణికులు, అటు వైపు పంట పొలాలు ఉన్న రైతులు ఎంతో ఆనందం వ్యక్తంచేశారు. కానీ పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేసి రోలింగ్ చేయగా, తారు పనులను ఇప్పటికీ ప్రారంభించ లేదు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటేనే నరకం కనిపిస్తున్నదని రైతులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వన్నెల్(బి) శివారు నుంచి వేంపల్లి, రెంజర్ల రోడ్డు దాటుతూ ముప్కాల్ మండలం కొత్తపల్లి వరకు తారురోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనప్పటికీ.. ఓ వైపు మాత్రమే పనులు ఇప్పటి వరకు ప్రారంభమయ్యాయి. ఆ పనులు కూడా అంపూర్తిగా ఉన్నాయి. కంకర వేసి వదిలేయడంతో కాలు తీసి కాలు వేయాలంటే తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటున్నది. అధికారులు స్పందించి తారు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరతున్నారు.


మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

త్వరలోనే పూర్తి చేస్తాం

రోడ్డు పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. వాతావరణం సరిగా లేకపోవడంతో తారు పనులను చేపట్టడం లేదు. వర్షాలు కురువకుంటే రెండు, మూడు రోజుల్లో పనులను ప్రారంభించి పూర్తి చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ, బాల్కొండ

సీపీఐ ఎమ్మెల్యేను కలిసిన నేతలు



ఖలీల్‌వాడి: జిల్లాకు చెందిన సీపీఐ నాయకులు బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూణంనేని సాంబశివరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో గలమెత్తి సమస్యలు పరిష్కరిస్తానని సాంబశివరావు జిల్లా నాయకత్వానికి తెలిపారు. నాయకులు సుధాకర్, ఓమయ్య తదితరులు ఉన్నారు.

శివాలయానికి రూ.51వేల విరాళం



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి ఇటీవల ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పైడి రాకేశ్‌రెడ్డి రూ.51వేలు విరాళం అందజేశారు. గుడి నిర్మాణానికి మరింత సహకారం అందిస్తానని ఆయన వెల్లడించారు. ఎంపీటీసీ సుగుణ చిన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ మిన్కు చిన్నారెడ్డి, ఎన్ రాజు, గడ్డం నవీన్, సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి నారుకు తెగుళ్లు


తెగుళ్లబారిన పడిన నారుమడి

- ఆందోళనలో రైతులు
- పంట సాగుపై తుపాన్ ప్రభావం
- నాట్లు వాయిదా వేయాలంటున్న అధికారులు

మాక్లూర్: తుపాన్ ప్రభావం కారణంగా వరి నారు తెగుళ్లబారిన పడుతున్నది. మూడు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో నారు కుళ్లిపోతున్నది. జింక్ స్ప్రే చేసినా ఫలితం లేకుండా పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో మండల వ్యాప్తంగా మొత్తం 24వేల ఎకరాల్లో వరి, 100 నుంచి 200 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుకానున్నాయని మండల వ్యవసాయాధికారిణి పద్మ తెలిపారు. ఇప్పటికే కృష్ణానగర్, కొత్తపల్లి, ముల్లంగి(బి), డీకంపల్లి, వల్లభాపూర్, చిక్లి, కల్లెడి గ్రామాల్లో రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతుండగా, వాతావరణంలో మార్పుల కారణంగా వాయిదా వేసుకుంటున్నారు.

నారు మడి కుళ్లిపోతోంది



నేను నారు పోసి 10 రోజులైంది. నాలుగో రోజునుంచే వాతావరణంలో మార్పు రావడంతో మొలక ఎర్రబారి కుళ్లిపోతోంది. ఇప్పటికీ రెండు సార్లు స్ప్రే చేసినా ఫలితం కనిపించడం లేదు. మళ్లీ నారు పోసే పరిస్థితి వస్తుందేమోనని ఆందోళనగా ఉంది. – కుర్మే బీరయ్య, రైతు, వల్లభాపూర్

జింక్ స్ప్రే చేయాలి

మూడు రోజులుగా వాతావరణంలో మార్పు కారణంగా జింక్ లోపం ఏర్పడి నారుమడులు ఎర్రబారి కుళ్లిపోయే అవకాశం ఉంది. రైతులు జింక్‌ను తగు మోతాదులో స్ప్రే చేస్తే సరిపోతుంది. నాట్లు వేసుకోవాలనుకునే రైతులు తుపాన్ ప్రభావం తగ్గే వరకు ఆగితే మంచిది.

– పద్మ, మండల వ్యవసాయాధికారిణి, మాక్లూర్

విద్యార్థులకు 'ఏ మ్యాట్' పరీక్ష



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం ఆర్యబట్ట మెంటల్ ఎబిలిటీ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం నలంద ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సంప్రదాయ సబ్జెక్టుతోపాటు నేటి ఆధునిక ప్రపంచానికి తగ్గట్టుగా గణితం, ఎబిలిటీ, విజ్ఞాన, లాజికల్ ప్రాబ్లమ్స్ సాధనలో పరిపూర్ణత సాధించే విధంగా విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందించడానికి 'ఏ మ్యాట్' పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయు లు అక్షయ్, హన్మాండ్లు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరట్టు ఉత్సవం


బోధన్‌లోని రాకాసీపేట్‌లో..

నవీపేట/బోధన్ టౌన్ : అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని మాలధారులు బుధవారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నవీపేట మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహంతో వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. దర్యాపూర్ చెరువులో స్వామి విగ్రహానికి చక్రస్నానం, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శశాంక్‌జోషి, అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు రామాగౌడ్, సంజీవ్‌రెడ్డి, సాయితేజ, రాకేశ్, నూనె శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలో అయ్యప్ప స్వామి ఆరట్టు మహోత్సవాన్ని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆరట్టు మహోత్సవాన్ని ఏసీపీ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు రాకాసీపేట్ కాలనీల్లో సాగింది. మాలధారులు రంగులుచల్లుకుంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం పట్టణ శివారులోని పసుపు వాగులో స్వామివారి విగ్రహానికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం ఆలయంలో పడిపూజ చేసి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆరట్టు మహోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ, కార్యదర్శి ఐఆర్ చక్రవర్తి, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్, అర్చకులు సంతోష్‌శర్మ, మాలధారులు పాల్గొన్నారు.


నవీపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా


కోటగిరిలో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

రుద్రూర్: కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని.. తాను అండగా ఉంటానని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. పొతంగల్ మండలం హెగ్డోలి, కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడి పోయినందుకు బాధ పడొద్దని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున సంతోష పడాలని అన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను వెంట ఉండి గెలిపిస్తానని అన్నారు. నస్రుల్లాబాద్ ప్రాంతంలో నివా సం ఏర్పాటు చేసుకుని నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. వివిధ మండలాల అధ్యక్షులు తోట అరుణ్, పుప్పాల శంకర్, షాహీద్, మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, ఎలమంచిలి శ్రీనివాస్‌రావు, శివరాజ్‌దేశాయ్, పార్టీ నాయకులు అడ్డ సాయిలు, పార్వతి ప్రవీణ్, సునీల్ కుమార్, బజ్జా నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై అధికారుల నిర్లక్ష్యం


జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న వేల్పూర్ జెడ్పీటీసీ అల్లకొండ భారతి

వేల్పూర్: మండలంలోని చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు అల్లకొండ భారతి అన్నారు. బుధవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఆమె తాగునీటి సరఫరాపై అధికారులను ప్రశ్నించారు. మిషన్ భగీరథ తాగునీరు ఎంతో విలువైందని, చాలా చోట్ల రహదారులపై నీరు వృథాగా వెళ్తున్నదని ఆమె సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు.. నీటి సరఫరా మెరుగుపరుస్తామని సమాధానమిచ్చినట్లు ఆమె తెలిపారు.

విద్య సామగ్రి అందజేత

నందిపేట(ఆర్మూర్): మండలంలోని బాద్గుణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీరామస్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పెన్నులు, కంపాస్‌బాక్సులు పంపిణీ చేశారు. మొత్తం 112 మంది విద్యార్థులకు విద్య సామగ్రిని అందజేశారు. టి శ్రీనివాస్, టి రామ్మోహన్‌రావు, నల్ల నగేశ్, దయాకర్, రాజశేఖర్, రమేశ్, ఆరేపల్లి శేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్‌టౌన్(బోధన్): నిజాం షుగర్‌ఫ్యాక్టరీని పునః ప్రారంభించి కార్మికుల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 124వ రోజుకు చేరాయి. దీక్షలో కార్మికులు నాగరాజు, భవన్‌దాస్ కూర్చున్నారు. కార్మికులు వికారొద్దీన్, రాఘవ్, నయీమొద్దీన్, అన్వర్‌మియా, బషీర్, జలీల్ సంఘీభావం తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జెల్ల సాగరిక రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మధురిమ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 8 నుంచి 10వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పోటీల్లో సాగరిక పాల్గొంటుందన్నారు. సాగరికను పాఠశాల సిబ్బంది బుధవారం అభినందించారు.

మిషన్ భగీరథ పైప్ లైన్‌కు లీకేజీ



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ జాతీయ రహదారి 44నుంచి మెండోరా మండల కేంద్రం వరకు రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ ఏర్పడింది. దీంతో లీకేజీ నీరు రోడ్డుపై పారుతున్నది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ అధికారులు స్పందించి వెంటనే లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బాలికల హక్కులపై అవగాహన



బాల్కొండ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలహక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. బాలికల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేయొద్దన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియలో 'మన రాష్ట్రాలు - మన పండుగలు'



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ హైస్కూల్‌లో బుధవారం 'మన రాష్ట్రాలు - మన పండుగలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఒక్కో రాష్ట్రంలో విభిన్న ఆచారాలు ఉన్నప్పటికీ భారతీయత అనే భావన అందరినీ కలిపి ఉంచుతున్నదన్నారు. అనంతరం అన్ని రాష్ట్రాల పండుగలకు సంబంధించిన సంప్రదాయాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న మండల పరిషత్ సమావేశం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గౌతమి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్‌లతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, సమయ పాలన పాటించాలని ఆయన సూచించారు.

అంబేడ్కర్‌కు ఘననివాళి

- ఆయా సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతి


ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనవికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నవీపేటలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితోపాటు బీజేపీ, ఆయా పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో, నవీపేటలో బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయా చోట్ల దళిత సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. వేల్పూర్ మండలం రామన్నపేట్, పడగల్ గ్రామాల్లో అంబేడ్కర్, దళిత సంఘాల ఆధ్వర్యంలో, బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెంజల్ మండలంలోని ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఘననివాళులు అర్పించారు. బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. మోస్రా మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రుద్రూర్, కోటగిరి, పొతంగల్ మండలాల్లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కోటగిరిలో దళిత ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.


డొంకేశ్వర్‌లో యువజన సంఘాల నాయకులు..


బాల్కొండ ప్రభుత్వ కళాశాలలో..


బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో..


నందిపేట్‌లో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


రెంజల్‌లో..


కోటగిరిలో..

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – యానిమల్ (తెలుగు)- 10.00, 2.00,6.00,10.00
స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 09.30, 12.45, 4.00, 7.15, 10.30
స్క్రీన్-3 – యానిమల్ (తెలుగు)- 10.15, 2.15
హాయ్ నాన్న (తెలుగు)- 6.15, 9.30
స్క్రీన్-4 – హాయ్‌నాన్న(తెలుగు)- 10.30, 1.45
యానిమల్ (తెలుగు) 10.30, 1.45
యానిమల్ (తెలుగు) - 5.00, 9.00